

సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 28.996 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 3,883 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.58,350
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,257
3 శాతం జీఎస్టీతో..	రూ.5,415
నవర (8 గ్రా)	రూ.43,320

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.8 /28.8

బుధవారం గాలిలో తేమ 59 శాతం ఉంది. గురువారం జిల్లాలో పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

97.84 శాతం మందికి పింఛన్ల పంపిణీ

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లావ్యాప్తంగా కొనసాగుతోంది. నాలుగో రోజు బుధవారం 97.84 శాతం మందికి వలంటీర్లు పింఛన్ నగదు పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 3,17,722 మందికి పింఛన్ నగదు అందజేయాల్సి ఉండగా, 3,10,860 మందికి పంపిణీ చేశారు. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు పంపిణీ చేయడమే కాకుండా, అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చికిత్సపొందుతున్న వారికి సైతం ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ నగదు అందజేస్తున్నారు.

డీపీఈఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన నాగమల్లేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌చార్జి అధికారిగా కె.నాగమల్లేశ్వరరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కె.వెంకటరామిరెడ్డి గుంటూరు జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో నాగమల్లేశ్వరరెడ్డి నియమితులయ్యారు. సత్తెనపల్లికి చెందిన నాగమల్లేశ్వరరెడ్డి ఎక్సైజ్‌శాఖలో ఏఈఎస్‌గా బాధ్యతల్లో చేరారు. రాజమండ్రి డిపో మేనేజర్‌గా పనిచేస్తూ బదిలీపై నెల్లూరుకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రామారావు ఉన్నారు.

అనుమతి లేకుండా టీడీపీ నేతల ర్యాలీ

నెల్లూరు సిటీ: తెలుగుదేశం పార్టీ నాయకులు బుధవారం నిబంధనలను అతిక్రమించి అనుమతులు లేకుండా నెల్లూరు నగరంలోని వీఆర్సీ సెంటర్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. గత నెల 10వ తేదీ నుంచి 144 సెక్షన్ అమలులో ఉంది. సభలు, సమావేశాలు అనుమతి లేకుండా నిర్వహించకూడదని పోలీసు అధికారులు సూచించారు. అయినా టీడీపీ నాయకులు చంద్రబాబునాయుడు అరెస్ట్‌కు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన బాలుర జట్టు

కందుకూరు రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్–19 బాలబాలికల బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలను స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం నిర్వహించారు. హ్యాండ్‌బాల్‌కు సుమారు 40 మంది బాలురు, 25 మంది బాలికలు హాజరైనట్లు స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎం.ఆదినారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.సుబ్బారావు తెలిపారు. హాజరైన వారిలో నైపుణ్యం కలిగిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అదేవిధంగా బాస్కెట్‌బాల్‌కు 15 మంది బాలురు, 15 మంది బాలికలు హాజరైనట్లు తెలిపారు. ఈ జట్లు త్వరలో జరగబోయే అండర్–19 స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్‌లో పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

8న జిల్లా ఆర్చరీ జట్ల ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : జిల్లా జూనియర్ బాలబాలికల, సీనియర్ స్త్రీ, పురుషుల ఆర్చరీ జట్ల ఎంపికలను నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 8న ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 20 నుంచి వైఎస్సార్ జిల్లా వేంపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ధ్రువీకరణపత్రాలతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 94419 55334 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అక్రమ రవాణాపై ఉక్కుపాదం

పేదల బియ్యాన్ని బొక్కే అక్రమార్కులపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోంది. పటిష్ట చర్యలతో బియ్యం అక్రమ రవాణాకు చెక్ పెడుతోంది. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తోంది. చౌక ధరల దుకాణాల ద్వారా పేదలకు పంపిణీ చేసే నిత్యావసరాలను దారి మళ్లించిన, దుర్వినియోగానికి పాల్పడిన వారిపై 6ఏ కేసులతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తోంది. ఇప్పుడు దీర్ఘకాలికంగా బియ్యాన్ని బ్లాక్ మార్కెటింగ్ చేస్తూ తరుచూ పట్టుబడిన వ్యక్తులపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తోంది.



రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

- బియ్యాన్ని పక్కదారి పట్టించే వారిపై 6ఏ కేసుల నమోదు
- ప్రత్యేక యాప్‌తో రియల్ టైం మానిటరింగ్
- గడిచిన ఐదేళ్లలో 315 కేసుల నమోదు

నెల్లూరు(దర్గామిట్ట): గతంలో రేషన్ బియ్యం విచ్చలవిడిగా అక్రమ రవాణా జరిగేది. వందల టన్నుల బియ్యం సరిహద్దులు దాటేది. మరో పక్క పేదలు తినే బియ్యంపై కొందరు అసత్య ప్రచారం చేసి, వాటిని తక్కువ రేటుకు కొని తిరిగి పాలిష్ పట్టి మార్కెట్‌లోకి తెచ్చి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకునేవారు. టన్నుల కొద్దీ లారీల్లో తరలిపోతున్నా కేసులు నమోదయ్యేవి కావు. ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇలాంటి అక్రమార్కుల ఆట కట్టిస్తోంది. రేషన్ బియ్యం రవాణాపై నిఘాను పటిష్టం చేసింది. అంతర్రాష్ట్ర సరిహద్దులు, మండల నిల్వ పాయింట్లు, చౌక దుకాణాలు, ఎండీయూ వాహనాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిరంతర నిఘా పెట్టడంతో చాలావరకు అక్రమ రవాణా తగ్గిందని తెలుస్తోంది. నిత్యావసర వస్తువుల చట్టం – 1955 సెక్షన్–6ఏ ప్రకారం అక్రమ రవాణాలో పట్టుబడిన సరుకులు, వాహనాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తోంది. గత ఐదేళ్లలో అధికారులు 315 కేసులు నమోదు చేశారు. ఈ కేసులు సత్వరం పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుని అక్రమార్కులకు త్వరితగతిన శిక్షలు పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పట్టుబడిన బియ్యాన్ని వెంటనే తిరిగి పీడీఎస్ మార్కెట్‌లోకి తెస్తోంది. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. జిల్లాల్లో బియ్యం అక్రమ రవాణాలో పట్టుబడిన సరుకుల నిల్వల విలువ రూ.50 లక్షల లోపు ఉంటే జేసీలు, అంతకు పైబడి ఉంటే కలెక్టర్లకు కేసుల పరిష్కార బాధ్యతలను అప్పగించింది. ఫలితంగా సీజ్ చేసిన సరుకు ముక్కిపోయి పురుగులు పట్టి పాడవకుండా బహిరంగ వేలం ద్వారా వెంటనే తిరిగి మార్కెట్లోకి తెస్తోంది. ఇప్పటి వరకు 6ఏ కేసులు 315 నమోదు చేస్తే, వాటిలో 7779.13 క్వింటాళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి రూ.2,87,82,781 విలువ చేసే రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.



జలదంకిలో పట్టుబడిన రేషన్ బియ్యం (ఫైల్)

పటిష్ట నిఘాతో అక్రమ రవాణా కట్టడి



ఇప్పటి వరకు అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి పక్కన పెట్టేవారు. వాటిని పట్టించుకోకపోవడంతో తినడానికి పనికిరాకుండా పాడయ్యేవి. ఈ క్రమంలోనే మేము 6ఏ కేసుల పరిష్కారంపై దృష్టి పెట్టాం. కేసులు వేగంగా పరిష్కారమయ్యేలా పర్యవేక్షిస్తున్నాం. దీనికితోడు బ్లాక్ మార్కెట్ దందాకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తున్నాం.

– రోణంకి కూర్మనాథ్, జాయింట్ కలెక్టర్

రియల్ టైం మానిటరింగ్

ఎప్పటికప్పుడు 6ఏ కేసుల స్థితిగతులను ఆన్‌లైన్‌లో పర్యవేక్షించేందుకు పౌరసరఫరాల శాఖ ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేసింది. కేసు నమోదు చేసిన వెంటనే సీజ్ చేసిన స్టాక్ వివరాలను ఇందులో అప్‌లోడ్ చేస్తారు. ఇందులో తేదీలు, నెలవారీగా నమోదైన కేసులు, పరిష్కరించినవి, సీజ్ చేసిన స్టాక్, బయటకు విడుదల చేసిన స్టాక్ వివరాలను రియల్ టైం మానిటరింగ్ చేసేలా ప్రత్యేక వ్యవస్థను రూపొందించింది. పీడీఎస్ బియ్యాన్ని దారి మళ్లించి వాటిని రీసైక్లింగ్ చేసి కస్టమ్ మిల్లింగ్ రైస్ కింద చూపించడం, పాలిష్ పట్టి కొత్త ప్యాకింగ్‌తో మార్కెట్‌లో విక్రయించడాన్ని సంపూర్ణంగా నిరోధించే ప్రయత్నం చేస్తోంది.

2019-23 మధ్య నమోదైన 6ఏ కేసుల వివరాలు

సంవత్సరం	నమోదైన కేసులు	పట్టుబడిన బియ్యం (క్వింటాళ్లలో)	పట్టుబడిన స్టాక్ విలువ
2019	28	343.83	రూ.12,72,171
2020	34	396.56	రూ.14,67,272
2021	74	584.53	రూ.21,62,761
2022	116	3,432.07	రూ.1,26,98,659
2023	63	3,022.14	రూ.1,11,81,918

భక్తులకు అన్ని ఏర్పాట్లు

- కసుమూరు దర్గా గంధ మహోత్సవం నిర్వహణపై ఆర్డీఓ మలోల సమీక్ష



మాట్లాడుతున్న ఆర్డీఓ మలోల

వెంకటాచలం: మండలంలోని కసుమూరు మస్తాన్‌వలి దర్గా 246 గంధ మహోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని నెల్లూరు ఆర్డీఓ మలోల సూచించారు. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు జరగనున్న మస్తాన్‌వలి దర్గా గంధ మహోత్సవాల నిర్వహణపై కసుమూరులో బుధవారం నెల్లూరు ఆర్డీఓ మలోల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా గ్రామ పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పోలీస్ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా, పార్కింగ్‌కు కేటాయించిన ప్రదేశాల్లోనే వాహనాలు నిలిపేలా చర్యలు చేపట్టాలన్నారు. బస్సులు నడిపేందుకు ఆర్టీసీ డిపో అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, అగ్నిమాపక యంత్రాలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వక్ఫ్‌బోర్డు అధికారులు అన్ని శాఖల అధికారులు, ముజావర్లను సమన్వయం చేసుకుని ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో దర్గా వక్ఫ్‌బోర్డు అధికారి పఠాన్ అస్లాంఖాన్, సర్పంచ్ కడివేటి శివ, ఉప సర్పంచ్ బాబర్, కోఆప్షన్ సభ్యుడు హుస్సేన్, దర్గా ముజావర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిర్వాసితులను ఆదుకుంటాం



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్



హాజరైన నిర్వాసిత గ్రామాల ప్రజలు

- పోర్టు నిర్వాసితులకు పూర్తి సౌకర్యాలతో పునరావాస కాలనీలు
- మత్స్యకారుల కోసం జెట్టీలు నిర్మిస్తాం
- కలెక్టర్ హరినారాయణన్

కందుకూరు: రామాయపట్నం పోర్టు నిర్వాసిత గ్రామాల ప్రజలను అన్నివిధాలా ఆదుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వాసిత గ్రామాలైన కర్లపాళెం, మొండివారిపాళెం, చాకిచర్ల, చేవూరు గ్రామాల ప్రజలతో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాసిత గ్రామాల ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కర్లపాళెం ప్రజలకు స్థలాల కేటాయింపు, పరిహారం అందించడంలో ఆలస్యం జరిగిందని, వర్షాకాలం వస్తున్నందున ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు కోరారు. స్పందించిన కలెక్టర్ గ్రామస్తులు కోరిన విధంగా 45 ఎకరాల భూమిని ఎంపిక చేశామని, అందులో 20 ఎకరాలు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.అయితే, మరో 25 ఎకరాలకు సంబంధించి కోర్టు కేసు ఉన్నందున కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కోర్టు ఉత్తర్వులు వ్యతిరేకంగా వస్తే మరో స్థలం ఎంపిక చేస్తామని హామీ ఇచ్చారు. పోర్టు నిర్మాణం వల్ల మత్స్యకారుల ఉపాధి దెబ్బతినకుండా జెట్టీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, భూసేకరణ కూడా త్వరలో చేపడతామని వివరించారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

పోర్టు నిర్మాణం కోసం డ్రెడ్జింగ్ చేయడం వల్ల ఆ ప్రాంతంలో చేపల వేటకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మత్స్యకారులు తెలిపారు. ఇసుక దిబ్బలకు తగిలి ఖరీదైన వలలు దెబ్బతింటున్నాయని, చేపలు కూడా దూరంగా లోతైన ప్రాంతాలకు వెళ్లడం వల్ల దొరకడం లేదన్నారు. పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్.. సంబంధిత పోర్టు అధికారులు శనివారం నిర్వాసిత గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. పోర్టు తరఫున మత్స్యకారుల ఇబ్బందులను పరిష్కరించేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించాలని పోర్టు అధికారులకు కలెక్టర్ సూచించారు. ఇక చేవూరు, రావూరు గ్రామాల భూసమస్యలను ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పలుమార్లు తన దృష్టికి తీసుకొచ్చారని, భూములకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేస్తామని తెలిపారు. ఎంత ధర ఇవ్వాలో ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అలాగే పోర్టు కోసం నోటిఫై చేసిన భూములు మినహా ఇతర భూముల అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించి ఎలాంటి ఇబ్బంది లేదని, ఆ మేరకు జిల్లా రిజిస్ట్రార్‌తో కూడా మాట్లాడతానన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ సమస్యలు, సీపీడబ్ల్యూఎస్ స్కీం, మోపాడు మైనర్ ఇరిగేషన్ ట్యాంక్ సమస్యలను కలెక్టర్ దృష్టికి ఎమ్మెల్యే తీసుకొచ్చారు. వీటిపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్, సబ్‌కలెక్టర్ ఎస్‌ఎస్ శోభిక, పోర్టు అధికారి ఐవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

14 ఎకరాల్లో ఎంజీఆర్ స్మృతివనం

- ఇంజినీర్లతో ఎమ్మెల్యే మేకపాటి సమీక్ష

నెల్లూరు(దర్గామిట్ట): దివంగత ఐటీశాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి స్మృతివనాన్ని ఉదయగిరిలోని ఎంజీఆర్ వ్యవసాయ కళాశాలలో సుమారు 14 ఎకరాల్లో దాదాపు రూ.7 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్నారు. బుధవారం ఇందుకు సంబంధించి ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఇంజినీర్లతో సమీక్షించారు. డీబీసీ ఆర్కిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఇంజినీర్లు స్మృతివనం రూపకల్పన నమూనాలకు సంబంధించి పలు అంశాలను ఎమ్మెల్యే మేకపాటికి వివరించారు. అత్యాధునిక సదుపాయాలతో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్కులు ఏర్పాటు చేయనున్నారు. అలాగే యోగా, ధ్యాన కేంద్రాలు ఏర్పాటుపై చర్చించారు. ఓపెన్ ఎయిర్ థియేటర్‌తోపాటు పిల్లలకు ఆహ్లాదకర వాతావరణంలో ఆటస్థలం, వ్యాయామానికి అనువైన స్థలాలు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు.



స్మృతివనం నమూనాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికే 'జగనన్నకు చెబుదాం'



లింగసముద్రంలో యువతి నుంచి అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్

లింగసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించనున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. లింగసముద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అందించిన అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాలను జిల్లాలోని ప్రతి మండలంలో బుధ, శుక్ర వారాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల గురించి ప్రజలకు ముందుగా తెలియజేస్తున్నామన్నారు. అందులో భాగంగా కందుకూరు డివిజన్‌లోని లింగసముద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. నిర్ణీత కాలవ్యవధిలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువు లోపు పరిష్కారం కాకపోతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. లింగసముద్రం మండల ప్రజల నుంచి 60 అర్జీలు అందినట్లు తెలిపారు. రెవెన్యూ సమస్యలపై ఎక్కువ అర్జీలు వచ్చాయన్నారు. భూసమస్యలు శాశ్వతంగా పరిష్కరించాలనే లక్ష్యంతో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష కార్యక్రమం ద్వారా భూముల రీసర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే గ్రామాల్లో మ్యుటేషన్లు, ఎఫ్‌లైన్ సర్వే, వెబ్‌ల్యాండ్‌లో లోటుపాట్లు సరిచేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ సుస్మిత, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, వ్యవసాయశాఖ జేడీ సుధాకర్‌రాజు, ఆర్టీసీ ఆర్‌ఎం శేషయ్య, డీటీసీ చందర్, డీఆర్‌డీఏ, డ్వామా, హౌసింగ్ పీడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావు, నాగరాజు, సర్వే రికార్డుల ఏడీ హనుమాన్ ప్రసాద్, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, డీఈఓ గంగాభవాని, సీపీఓ ఏఎస్ రాజు, పలువురు జిల్లా అధికారులు, తహసీల్దార్ టి.ప్రసాద్, ఎంపీడీఓ శేషుబాబు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నేత.. వసూళ్ల మేత

- ఉపాధి పేరుతో యువతకు గాలం
- ప్రభుత్వానికి దాదాపు రూ.10 కోట్ల జీఎస్టీ ఎగనామం
- పాత ఏజెన్సీ మూసేసి.. కొత్త ఏజెన్సీలతో కార్యకలాపాలు



Directorate General of GST Intelligence

SHOW CAUSE NOTICE

BRIEF ABOUT THE NOTICEE:

INTELLIGENCE & INVESTIGATION:

SCRUTINY OF RECORDS:

పురుషోత్తంకు జీఎస్టీ అధికారులు ఇచ్చిన నోటీసు

కోవూరు (బుచ్చిరెడ్డిపాళెం): నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానంటూ టీడీపీ నేత జె.పురుషోత్తం ముఖ్యంగా యువతులకు గాలం వేసి రూ.కోట్లు కొల్లగొట్టాడు. గతంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని మేన్ పవర్ రిక్రూట్‌మెంట్ సప్లయి ఏజెన్సీ సర్వీస్ ఏర్పాటు చేసుకుని ప్రభుత్వానికి చెల్లించాల్సిన సుమారు రూ.10 కోట్ల జీఎస్టీ కూడా ఎగనామం పెట్టాడు. గత ప్రభుత్వంలో తన పనులు చక్కబెట్టుకునేందుకు పలు దాష్టీకాలు చేశాడు. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన సదరు నేత ఎంఎస్ అన్‌ఎంప్లాయిమెంట్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్‌ను స్థాపించాడు. మేన్ పవర్ రిక్రూట్‌మెంట్ సప్లయి ఏజెన్సీ సర్వీస్ పేరుతో గడిచిన కొన్నేళ్లుగా ఉద్యోగాల పేరుతో యువతకు ఎర వేయడం ఆరంభించాడు. అధికార పార్టీ అండదండలతో గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో నిరుద్యోగ యువతీ యువకులను మోసం చేసినట్లు తెలుస్తోంది. అన్ని రకాలుగా అతని చేతిలో మోసపోయిన నిరుద్యోగులు తమకు జరిగిన అన్యాయంపై ఎక్కడా, ఎవరికీ ఫిర్యాదులు చేసేందుకు కూడా సాహసించలేకపోతున్నారని తెలిసింది.

రూ.10 కోట్ల జీఎస్టీ బకాయిలు

ఈ టీడీపీ నేత గత ప్రభుత్వంలో అధికారాన్ని, అధికారులను అడ్డం పెట్టుకుని మేన్ పవర్ సప్లయి సర్వీసెస్ ద్వారా కాంట్రాక్ట్ బేస్ట్ ఉద్యోగాలిస్తూ నిరుద్యోగుల నుంచి రూ.కోట్లు దండుకున్నాడు. ఈ వ్యాపారం ద్వారా వచ్చిన రాబడికి సంబంధించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీ దాదాపు రూ.10 కోట్ల వరకు ఎగనామం పెట్టినట్లు సమాచారం. ఇప్పటికే విశాఖపట్నం జీఎస్టీ అధికారులు అతనికి నోటీసులు కూడా జారీ చేశారు. ప్రస్తుతం అతను నెల్లూరులోని ఏజెన్సీని మూసివేశాడు. కొత్తగా మరో పేరుతో తిరుపతి, చిత్తూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఏజెన్సీలను ప్రారంభించాడని తెలుస్తోంది. అక్కడ మరో అవతారం ఎత్తి నిరుద్యోగ యువతీ, యువకులను మోసం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాడని స్థానికంగా చర్చించుకుంటున్నారు.

కౌన్సిలర్‌గా పోటీకి నామినేషన్ తిరస్కరణ

రెండేళ్ల క్రితం జరిగిన బుచ్చిరెడ్డిపాళెం మున్సిపల్ ఎన్నికల్లో సదరు టీడీపీ నేత రెండో వార్డు కౌన్సిలర్‌గా పోటీ చేసేందుకు నామినేషన్ దాఖలు చేశారు. అయితే అతను ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో బకాయి ఉన్నందున, ఈ విషయాన్ని అప్పట్లో స్థానికులు ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయడంతో అతని నామినేషన్‌ను ఎన్నికల అధికారులు పరిశీలించి స్క్రూట్నీలో రద్దు చేశారు. అతని అక్రమాలపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి లోతుగా విచారణ చేపడితే పలు అంశాలు బయటకు వచ్చే అవకాశాలున్నాయని బాధితులు కోరుతున్నారు.

ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను వినియోగించుకోండి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఆదేశాల మేరకు ఈ నెల 12వ తేదీన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను నెల్లూరు నగరంలోని విద్యుత్‌భవన్‌లో నిర్వహించనున్నట్లు విద్యుత్‌శాఖ నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 నుంచి 1.30 గంటల వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమంలో వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కార వేదిక అధ్యక్షుడు శ్రీనివాసఆంజనేయమూర్తి, విద్యుత్‌శాఖ ఆర్థికరంగ సభ్యుడు రామ్‌మోహన్‌రావు, సాంకేతికరంగ సభ్యుడు అంజనీకుమార్, స్వతంత్ర సభ్యురాలు ఈశ్వరమ్మతోపాటు ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు పరిశీలిస్తారని తెలిపారు. నెల్లూరు నగరానికి చెందిన విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు మనుబోలు విద్యార్థిని



హాసినికి జ్ఞాపిక అందజేస్తున్న హెచ్‌ఎం

మనుబోలు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థిని ఎస్ హాసినిప్రియ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులో నిర్వహించిన అండర్–17 కబడ్డీ పోటీల్లో రాణించి జిల్లా జట్టుకు ఎంపికైందని పాఠశాల పీడీ ప్రమీలారాణి తెలిపారు. ఈ సందర్భంగా హాసినిప్రియను పాఠశాల హెచ్‌ఎం వసంతకుమారి, ఉపాధ్యాయిని హసీనా, పీడీ బుధవారం సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

పారదర్శకంగా వ్యవహరించాలి

కందుకూరు: ఎన్నికల సిబ్బంది విధుల్లో పారదర్శకంగా వ్యవహరించాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ అన్నారు. కందుకూరు, కావలి అసెంబ్లీ నియోజకవర్గాల బీఎల్వోలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్వోలు, ఈఆర్వోలతో పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్ హాల్లో బుధవారం స్పెషల్ సమ్మరి రివిజన్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా 2024 జనవరి 5న ప్రచురించనున్న తుది ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. డీఆర్వో వెంకటనారాయణమ్మ, సబ్‌కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, కావలి ఆర్డీఓ శీనానాయక్ పాల్గొన్నారు.

'శ్రీ వెంకటేశ్వర'కు ఎన్‌బీఏ గుర్తింపు



కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొంటున్న కళాశాల అధ్యాపక బృందం

కొడవలూరు: నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం సంబరాలు నిర్వహించారు. కళాశాల చైర్మన్ పీ గుణశేఖర్ మాట్లాడుతూ సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్ కోర్సులకు ఎన్‌బీఏ గుర్తింపు లభించిందని తెలిపారు. కళాశాల దరఖాస్తు చేసుకున్న అన్నీ కోర్సులకు ఎన్‌బీఏ గుర్తింపు లభించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఇప్పటికే నాక్ ఏ గ్రేడ్, అటానమస్ పొందామని, తాజాగా ఎన్‌బీఏ గుర్తింపు లభించడం సంతోషకరమన్నారు. ప్రిన్సిపల్ వీ అనిల్‌కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్	: రూ.138
లేయర్	: రూ.118
బ్రాయిలర్ చికెన్	: రూ.238
స్కిన్‌లెస్ చికెన్	: రూ.264
లేయర్ చికెన్	: రూ.200



నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులను చికిత్సకు తీసుకెళ్తున్న అటెండర్లు

సదా రోగుల సేవలో..

గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులను సరిగా పట్టించుకునేవారు కాదు. రోగులను వైద్యపరీక్షలకు తీసుకెళ్లడం దగ్గర నుంచి వారికి అవసరమైన అన్ని సేవలను బంధువులే చూసుకోవాల్సి వచ్చేది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేందుకు రోగులు భయపడేవారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఆ పరిస్థితులు మారాయి. ఆస్పత్రులకు వచ్చే రోగులకు మేమున్నామంటూ అటెండర్లు భరోసా అందిస్తున్నారు. వైద్యపరీక్షలకు తీసుకెళ్లడం దగ్గర నుంచి అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తూ రోగుల సేవలో సంతృప్తి చెందుతున్నారు. దీంతో అటెండర్ల సేవలను చూసి రోగుల బంధువులు అభినందిస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 33వ డివిజన్ వెంగళరావునగర్ బీ–బ్లాక్ ప్రాంతంలో రూ.60 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33వ డివిజన్‌లో రూ.40 లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీలు, రూ.20 లక్షలతో అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు డివిజన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. రూరల్ పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రజలకు అవసరమైన చోట్ల నిధుల కేటాయింపు చేస్తామన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పార్టీలతో ప్రమేయం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్యన వారధిలా వ్యవహరిస్తున్నారన్నారు. అవినీతికి ఏ మాత్రం తావులేకుండా ప్రజలకు ఇంటి వద్దే ప్రభుత్వ సేవలు అందిస్తున్నారన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ప్రజలు ఆదరించాలని కోరారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి, రూరల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రైల్వే బోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, నాయకులు హరిబాబుయాదవ్, గౌరీ, మల్లికార్జున్‌యాదవ్, మేఘనాథ్‌సింగ్, శివ సునీల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పాలకీర్తి రవి, తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి పెద్దపీట



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

• నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రజలకు ఎంతో అవసరమైన విద్య, వైద్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని నగర ఎమ్మెల్యే పీ అనిల్ కుమార్ పేర్కొన్నారు. నగరంలోని విజయమహల్ గేట్ సమీపంలోని ఎంసీఎస్ కల్యాణ మండపంలో 44, 45, 46 డివిజన్లకు సంబంధించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా ప్రతి ఇంటికి ఏఎన్‌ఎంలు, వలంటీర్లు వెళ్లి వైద్యపరీక్షలు చేయడంతో పాటు స్పెషలిస్టు వైద్యులతో వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకునేలా చూడాలన్నారు. ఇప్పటికే నాడు–నేడు కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలలతో పాటు ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్పొరేటర్లు నీలి రాఘవరావు, ముదిరెడ్డి వేదవి సుబ్బారెడ్డి, వేలూరు మహేష్ పాల్గొన్నారు.

రాజకీయ పగటి వేషగాళ్లతో జాగ్రత్త

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



మహిళా రైతుకు పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న

కోవూరు: గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో ఏనాడూ ప్రజల మొహం చూడని రాజకీయ నాయకులు ఎన్నికలు సమీపిస్తుండడంతో ఇప్పుడు వస్తున్నారని, మరో మారు మోసం చేసేందుకు వస్తున్న అలాంటి రాజకీయ పగటి వేషగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మండలంలోని పాటూరులో చుక్కల భూముల రైతులకు పాస్‌బుక్‌లను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా చుక్కల భూముల సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా చరిత్రలో నిలిచిపోయేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. చుక్కల భూముల సమస్యను పరిష్కరించి పాస్‌బుక్‌లు పంపిణీ చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాదాపు నాలుగున్నరేళ్ల కాలం పాటు ప్రతిపక్షాలు గ్రామాల వైపు కన్నెత్తి చూడలేదన్నారు. కరోనా సమయంలోనూ ప్రజలను పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు ఎన్నికలు వస్తుండడంతో గ్రామాలకు వస్తున్నారని విమర్శించారు. చట్టం ముందు అందరూ సమానమేనని, చంద్రబాబు తప్పు చేశాడు కాబట్టే ఈ రోజు రాజమండ్రి జైల్లో ఊచలు లెక్కిస్తున్నాడన్నారు. రెండెకరాలు ఉన్న చంద్రబాబు ఏ దోపిడీలు చేయకుండా కోటీశ్వరుడు ఎలా అయ్యాడో ప్రజలకు చెప్పాలన్నారు. ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచి ఆయన్ని మానసికక్షోభకు గురిచేసిన పాపాన్ని బాబు అనుభవించక తప్పదన్నారు. చంద్రబాబుకు కష్టమొస్తే దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ బయటకు వస్తాడన్నారు. బాబు ఇచ్చే ప్యాకేజీలు తీసుకుని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తాడన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో మీ మధ్య ఎవరున్నారు.. మీరు ఎవరి వల్ల లబ్ధి పొందారో గుండె మీద చేయివేసుకుని ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. పారదర్శకంగా సంక్షేమ పథకాలుఅందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు.

టీటీడీ సహకారంతో తొమ్మిది ఆలయాల నిర్మాణం

నియోజకవర్గంలో తొమ్మిది ఆలయాల నిర్మాణానికి టీటీడీ ముందుకొచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. కోవూరు మండలం మోడేగుంటలో మాతమ్మ ఆలయం, పాటూరు చెంచమ్మతోపు ఎస్టీ కాలనీ, ఇనమడుగు ఎస్సీకాలనీ, విడవలూరు మండలం చౌకచర్ల పసలవారిపాళెం, వరిణి ఎస్సీకాలనీ, బుచ్చిరెడ్డిపాళెం మండలం నాగాయగుంట అరుంధతీయవాడ, కొడవలూరు మండలం నాయుడుపాళెం, తలమంచి శ్రీరామ్‌నగర్ కాలనీ, ఇందుకూరుపేట మండలం ఆదెమ్మసత్రం, లేబూరు బిట్–2లో రామాలయాల నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. ఒక్కో మందిరం నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పన ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ,శ్రీలత, సొసైటీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, వైస్‌ఎంపీపీ నరసింహులురెడ్డి, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

చెరువులో మునిగి ఇద్దరి మృతి



మురళీరెడ్డి, బాబిరెడ్డి మృతదేహాలు

ముత్తుకూరు: చెరువులోని గేదె కళేబరాన్ని వెలుపలకు తీసే క్రమంలో ఇద్దరు వ్యక్తులు నీట మునిగి మృతి చెందారు. ఈ విషాదకర ఘటన మామిడిపూడిలో చోటు చేసుకుంది. ముత్తుకూరు పోలీసుల వివరాల మేరకు.. ముత్తుకూరుకు చెందిన సుమంత్‌రెడ్డి గేదెలను మేతకు తోలుకెళ్లగా ఒక గేదె తప్పిపోయింది. దాని ఆచూకీ కోసం బంధువులైన మామిడిపూడికి చెందిన రావూరు బాబిరెడ్డి(55), ముత్తుకూరు బీసీ కాలనీకి చెందిన లింగారెడ్డి మురళీరెడ్డి(45) మంగళవారం గాలింపు చేపట్టారు. మామిడిపూడి పెద్ద చెరువులో గేదె కళేబరాన్ని గుర్తించి దాని చెవికి ఉన్న బీమా కమ్మను తీసుకొచ్చేందుకు చెరువులోకి దిగారు. ఈ క్రమంలో ఇద్దరూ నీట మునిగి మృతి చెందారు. స్థానికులు తీవ్రంగా గాలించి మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మృతదేహాలను వెలుపలకు తీశారు. బుధవారం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గేదె కళేబరం కోసం వెళ్లి ఇద్దరు మృత్యువాత పడడంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.